
నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
5 | నల్లగొండ, శుక్రవారం 23 మే 2025 | YADADRI BHUVANAGIRI

## డిగ్రీ పరీక్షల్లో 26 మంది డిబార్




రామగిరి, మే 22 : మహాత్మా గాంధీ యూనివర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డిగ్రీ పరీక్షల్లో గురువారం జరిగిన ఆరో సెమిస్టర్ రెగ్యులర్, ఒకటో సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షల్లో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 26 మంది విద్యార్థులు డిబార్ అయినట్లు సీఓఈ డాక్టర్ జి.ఉపేందర్‌రెడ్డి తెలిపారు. ఉదయం జరిగిన ఆరో సెమిస్టర్‌లో నల్లగొండ డీవీఎం కళాశాలలో ఒకరు, కాకతీయ కళాశాలలో ఒకరు, దేవరకొండ ఎంకేఆర్‌లో ఒకరు, భారతీ డిగ్రీ కళాశాలలో ఇద్దరు, సూర్యాపేట రాకేశ్ బీఈడీ కళాశాలలో ముగ్గురు, తిరుమలగిరి ప్రగతి డిగ్రీ కళాశాలలో ఒకరు డిబార్ అయ్యారు. మధ్యాహ్నం జరిగిన ఒకటో సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షల్లో 17 మంది విద్యార్థులు డిబార్ అయ్యారు. నల్లగొండ డీవీఎం కళాశాలలో ముగ్గురు, కాకతీయ కళాశాలలో ముగ్గురు, సిద్ధార్థలో ముగ్గురు, నీలగిరి కళాశాలలో ఒకరు, సూర్యాపేట ఎస్‌వీ కాలేజీలో ఒకరు, ఆర్‌కేఎల్‌కేలో ముగ్గురు, దేవరకొండ భారతీ డిగ్రీ కళాశాలలో ఇద్దరు, భువనగిరి నవభరత్‌లో ఒకరు డిబార్ అయ్యారు.



యాదగిరిగుట్ట పట్టణంలో ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య దిష్టిబొమ్మతో ర్యాలీ నిర్వహిస్తున్న బీఆర్‌ఎస్ శ్రేణులు

# తొలకరి పులకరింత

- సగటున 24 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు
- గట్టుప్పల్ మినహా అన్నిచోట్ల వర్షప్రభావం
- తిరుమలగిరి(సాగర్)లో అత్యధికంగా 79.7మి.మీ.
- వానకాలం సాగు పనులకు రైతన్నల సన్నద్ధం

## నల్లగొండ జిల్లా అంతటా వర్షం

నల్లగొండ ప్రతినిధి, మే22(నమస్తే తెలంగాణ) : నల్లగొండ జిల్లాలో బుధవారం మధ్యాహ్నం నుంచి గురువారం తెల్లవారు జాము వరకు ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. దాంతో జిల్లా అంతటా వర్ష ప్రభావం కనిపించింది. వారం రోజులుగా సూర్య ప్రతాపంతో తల్లడిల్లిన ప్రజానీకం ప్రస్తుత వర్షాలతో ఊపిరి పీల్చుకుంటున్నది. పలుచోట్ల భారీ వర్షం కురవడంతో రైతులు వ్యవసాయ పనులకు సన్నద్ధమవుతున్నారు. వానాకాలం సీజన్ కోసం ఇప్పటికే భూములు చదును చేసుకున్న రైతులతోపాటు మిగతా రైతులు దుక్కులు దున్నే పనిలో పడ్డారు. వాతావరణ శాఖ లెక్కల ప్రకారం గురువారం తెల్లవారు జాము వరకు జిల్లాలో సగటున 24 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు కావడం విశేషం. ఒక్క గట్టుప్పల్ మండలం మినహా మిగతా అన్ని చోట్లా వర్షం ఓ మాదిరి వర్షమైనా కురిసినట్లు లెక్కలు వెల్లడిస్తున్నాయి. అత్యధికంగా తిరుమలగిరి(సాగర్) మండలంలో 79.7మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

ఇక్కడ వర్షానికి వాగులు పొంగి పొర్లడంతో ఓ కుంటకు సైతం గండి పడింది. మరికొన్ని కుంటలు, చెరువుల్లోకి అదనంగా నీరు వచ్చి చేరినట్లు తెలిసింది. నకిరేకల్ మండలంలో 62మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. పెద్దవూరలో 51 మి.మీ, కనగల్‌లో 46.8మి.మీ, కేతేపల్లిలో 44.3మి.మీ, పీఏపల్లిలో 41.8మి.మీ, హాలియాలో 37మి.మీ, అడవిదేవులపల్లిలో 36.5మి.మీ, దామరచర్లలో 31.9మి.మీ వర్షపాతం నమోదైంది. నిడమనూరు మండలంలో 28.5మి.మీ, తిప్పర్తిలో 28మి.మీ, కట్టంగూర్‌లో 25.9మి.మీ, నార్కట్‌పల్లిలో 23మి.మీ, చింతపల్లిలో 22.1మి.మీ, త్రిపురారంలో 21.9మి.మీ, కొండమల్లేపల్లిలో 21.1మి.మీ, దేవరకొండలో 18.5మి.మీ, మాడ్గులపల్లిలో 17.1మి.మీ, మునుగోడులో 17.1మి.మీ, నల్లగొండలో 15.4మి.మీ, చందంపేటలో 14మి.మీ, గుర్రంపోడులో 14.4మి.మీ, చిట్యాలలో 13.9మి.మీ, మిర్యాలగూడలో 13.1మి.మీ, మర్రిగూడలో 10.9మి.మీ, వేములపల్లిలో 10మిల్లీమీటర్ల వర్షం పడింది. మిగతా మండలాల్లో 10 మిల్లీమీటర్ల కంటే తక్కువ వర్షపాతం నమోదైంది. మరో రెండు, మూడు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ సూచనలు చేస్తున్న నేపథ్యంలో జిల్లా అంతటా రైతులు హర్షం వ్యక్తం చేస్తూ వ్యవసాయ పనులకు సన్నద్ధం అవుతున్నారు. నాన్‌ఆయకట్టు ప్రాంతాల్లో పత్తి, ఇతర మెట్ట పంటల కోసం ఇప్పటికే భూములను చదును చేసుకుని సిద్ధంగా ఉన్నారు. అనువైన వర్షాలు కురిస్తే దుక్కులు దున్ని తర్వాత దశలో విత్తనాలు పెట్టే ఏర్పాట్లల్లో నిమగ్నమయ్యారు. ఈ నెల 25 నుంచి రోహిణి కార్తె ప్రవేశించనుండడంతో ఈ కార్తెలో విత్తు పడితే పంటలు బలంగా ఎదుగుతాయని రైతులు భావిస్తుంటారు. మరో దఫా సరైన వర్షం కురిస్తే రైతులు పత్తి, కంది వంటి విత్తనాలు పెట్టాలని భావిస్తున్నారు.



నార్కట్‌పల్లిలో బుధవారం కురిసిన వర్షం

## కేటీఆర్ జోలికొస్తే ఖబడ్దార్

- అనుచిత వ్యాఖ్యలు చేస్తే బట్టలూడదీసి కొడుతాం
- ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యపై బీఆర్‌ఎస్ శ్రేణుల ఫైర్
- యాదగిరిగుట్టలో బీర్ల దిష్టిబొమ్మ దహనం.. రాస్తారోకో

యాదగిరిగుట్ట, మే 22 : ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ఒళ్లు దగ్గర పెట్టుకుని మాట్లాడాలని.. కేటీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఊరుకునేది లేదని బీఆర్‌ఎస్ శ్రేణులు భగ్గుమన్నారు. ఖబడ్దార్.. అయిలయ్య అంటూ హెచ్చరించారు. బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌కు వెంటనే క్షమాపణ చెప్పాలని, లేకపోతే గ్రామాల్లో ఎక్కడిక్కడ అడ్డుకుంటామని హెచ్చరించారు. మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై బీర్ల అయిలయ్య చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ గురువారం యాదగిరిగుట్ట పట్టణంలో బీఆర్‌ఎస్ శ్రేణులు పెద్దఎత్తున ఆందోళనకు దిగారు. ఆ పార్టీ మండలాధ్యక్షుడు, కురుమ సంఘం రాష్ట్ర నాయకుడు కర్రె వెంకటయ్య ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ కార్యాలయం నుంచి స్వామివారి వైకుంఠ ద్వారం వరకు అయిలయ్య దిష్టిబొమ్మతో శవయాత్ర నిర్వహించారు. పాత గుట్ట చౌరస్తా వద్దకు రాగానే పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేసినా బీర్ల దిష్టి బొమ్మను దహనం చేశారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయం వద్ద ప్రధాన రహదారిపై బైఠాయించారు. కేటీఆర్‌కు క్షమాపణ చెప్పాలని భీష్మించుకుని కూర్చున్నారు. సీఐ భాస్కర్, ఎస్ఐ ఉదయ్ చేరుకొని బీఆర్‌ఎస్ నాయకులను అరెస్టు చేశారు. అనంతరం కర్రె వెంకటయ్య మాట్లాడుతూ రాష్ట్ర రాజధానిని ఐటీ హబ్‌గా మార్చి, ప్రపంచ అగ్రగామి సాఫ్ట్‌వేర్ కంపెనీలను హైదరాబాద్‌కు రప్పించి వేల మంది యువతకు ఉద్యోగాలు కల్పించిన ఘనత మాజీ మంత్రి కేటీఆర్‌ది అన్నారు. విదేశాల్లో ఉన్నత ఉద్యోగం, వ్యక్తిగత జీవితాన్ని త్యాగం చేసి ఉద్యమాలు చేసిన నాయకుడు కేటీఆర్ అని గుర్తు చేశారు. ఐదుసార్లు ఎమ్మెల్యేగా, రెండు సార్లు మంత్రిగా పని చేసిన నాయకుడి నాలుకపై యాసిడ్ పోస్తానని మాట్లాడుతావా బిడ్డా.. అంటూ మండి పడ్డారు. దమ్ముంటే ప్రజాక్షేత్రంలో తేల్చుకుందాం రావాలని సవాల్ విసిరారు. ఇచ్చిన హామీలు అమలు చేసే చేతగాని దద్దమ్మ పార్టీ కాంగ్రెస్ అని, అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర అవుతున్నా ఇప్పటి వరకు ప్రజలకు చేసిన మేలేమీ లేదని విమర్శించారు. ఆలేరు నియోజకవర్గ అభివృద్ధికి బీర్ల చేసింది శూన్యమని, గత ప్రభుత్వ పాలనలో యాదగిరిగుట్టకు మంజూరైన వైద్యకళాశాల ఏమైందని ప్రశ్నించారు. గుట్ట అభివృద్ధికి పెండింగ్‌లో ఉన్న 10 శాతం పనులకు రూపాయి కూడా కేటాయించని సీఎం రేవంత్‌రెడ్డి, జిల్లా మంత్రుల మోచేతి నీళ్లుతాగే నువ్వు.. ఇష్టారాజ్యంగా మాట్లాడితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ప్రజాప్రతినిధులు లేక గ్రామాలు అస్తవ్యస్తంగా మారాయని, స్థానిక సంస్థల ఎన్నికలు పెట్టాలంటే భయపడే మీకు.. బీఆర్‌ఎస్ పార్టీపై మాట్లాడే అర్హత లేదని మండిపడారు. పదేండ్ల బీఆర్‌ఎస్ పాలనలో స్వర్ణయుగాన్ని చూసిన రైతులు.. ఇప్పుడు రాక్షస రాజ్యాన్ని చూస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

బీర్ల అయిలయ్య అవినీతిపై త్వరలో నియోజకవర్గంలో పాదయాత్ర చేసి ప్రచారం చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ ఇమ్మడి రామిరెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గడ్డమీది రవీందర్‌గౌడ్, బీఆర్‌ఎస్ పట్టణ సెక్రటరీ జనరల్ పాపట్ల నరహరి, మాజీ ఉప సర్పంచ్ మారెడ్డి కొండల్‌రెడ్డి, నాయకులు మిట్ట వెంకటయ్య, గుండ్లపల్లి వెంకటేశ్‌గౌడ్, కసావు శ్రీనివాస్, ఆవుల సాయి, కవిడె మహేందర్, ముఖ్యర్ల సతీశ్, ఆరె శ్రీధర్, సయ్యద్ బాబా, కాంటేకార్ పవన్, ఆరే మల్లేశ్, మొగిలిపాక రమేశ్, శారాజీ రాజేశ్, ఒగ్గు మల్లేశ్, చిత్తర్ల బాలయ్య, శిఖ శ్రీనివాస్, అంకం నర్సింహ, ఆరె స్వామి, గడ్డం చంద్రం, గుణగంటి బాబారావు, పాండవుల భాస్కర్ పాల్గొన్నారు.



హుజూర్‌నగర్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఒంటెద్దు నరసింహారెడ్డి

## కాంగ్రెస్‌వి కక్షపూరిత రాజకీయాలు

- రాష్ట్ర ప్రాజెక్టులపై అవగాహన లేని నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్
- బీఆర్‌ఎస్ హుజూర్‌నగర్ నియోజకవర్గ సమన్వయకర్త నరసింహారెడ్డి

హుజూర్‌నగర్, మే 22 : తెలంగాణలో కక్షపూరిత రాజకీయాలకు కాంగ్రెస్ తెర లేపిందని బీఆర్‌ఎస్ పార్టీ హుజూర్‌నగర్ నియోజవకర్గ సమన్వయకర్త ఒంటెద్దు నరసింహారెడ్డి విమర్శించారు. పట్టణంలో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ప్రాజెక్టులు, బ్యారేజీ, డ్యామ్‌లకు తేడా తెలియని, కనీస అవగాహన లేని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడి కాళేశ్వరం ప్రాజెక్టు గురించి మట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. ఆయన నీటి పారుదల శాఖ మంత్రిగా ఉండడం రాష్ట్ర రైతాంగానికి శాపంగా మారిందని పేర్కొన్నారు. తెలంగాణలో 50లక్షల ఎకరా పంట పొలాలను కోటి ఎకరాలుగా తీర్చిదిద్దిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు.

కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో కేసీఆర్‌కు నోటీసులు ఇవ్వడం కాంగ్రెస్ పార్టీ డైవర్షన్ పాలిటిక్స్‌కు నిదర్శనమనారు. మరో 20 సంవత్సరాల పాటు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చేది లేదని తెలిసే సీఎం రేవంత్ సహ మంత్రులు దండుకునే పనిలో పడ్డారని ఆరోపించారు. ముఖ్యమంత్రిగా పదేండ్లు అద్భుతమైన పాలన అందించిన కేసీఆర్‌కు నోటీసులు ఇవ్వడంపై యావత్ తెలంగాణ ప్రజలు మండి పడుతున్నదన్నారు. అనంతరం హుజూర్‌నగర్‌లో ఇటీవల మృతి చెందిన ధనమూర్తి చిత్రపటానికి నివాళులర్పించి, ఆయన కుటుంబ సభ్యులను ఒంటెద్దు పరామర్శించారు. పదో వార్డులో ఇటీవల గాయపడిన జడ అంజిని పరామర్శించారు.

ఆయన వెంట మాజీ జడ్పీటీసీ కొప్పుల సైదిరెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ జక్కుల నాగేశ్వర్‌రావు, పట్టణ ప్రధాన కార్యదర్శి బెల్లకొండ అమర్, సీనియర్ నాయకులు కేఎల్ఎన్‌రెడ్డి, నాయకులు రామిశెట్టి రాము, చంటి, నరసింహారావు, రహీమ, ఉష, వెంకటేశ్ ఉన్నారు.

## ఇంట్లోనే లింగనిర్ధారణ పరీక్షలు

- నకిరేకల్‌లో బరితెగించిన ఆర్ఎంపీ
- ఏజెంట్లను ఏర్పాటు చేసుకుని ఎర
- డబ్బు కక్కుర్తితో అబార్షన్లు కూడా..
- ఇదే వ్యవహారంలో గతంలో జైలుకు..
- అనూష మృతితో మరోసారి వెలుగులోకి..

నకిరేకల్, మే 22 : లింగ నిర్ధారణ పరీక్షలకు నకిరేకల్ అడ్డాగా మారింది. పట్టణానికి చెందిన ఓ ఆర్ఎంపీ, అతడి భార్య గతంలో ఓ ప్రైవేట్ దవాఖానలో కాంపౌండర్లుగా పని చేసేవారు. లింగ నిర్ధారణ ఎలా చేయాలో భార్యకు భర్త ట్రైనింగ్ ఇప్పించాడు. ఆ ఆస్పత్రిలో భార్యాభర్తలు చేస్తున్న నిర్వాకం గమనించిన డాక్టర్ వారిని పోలీసులకు అప్పగించాడు. భార్యను తప్పించి భర్త తనపై నేరాన్ని వేసుకుని జైలుకు వెళ్లి వచ్చాడు. జైలు నుంచి విడుదలైన కొద్ది రోజులు సైలెంట్‌గా ఉండి లింగ నిర్ధారణ పరీక్ష యంత్రాన్ని సొంతంగా కొనుగోలు చేసుకొని ఇంట్లోనే దుకాణం పెట్టాడు. 5 నుంచి 8 మంది ఏజెంట్లను తయారు చేసుకొని వారికి డబ్బులు ఎరవేసి గర్భిణులకు నిర్ధారణ పరీక్షలు చేస్తున్నట్లు సమాచారం. ఒకవేళ అబార్షన్ చేయాల్సి వస్తే బాధితుల నుంచి రూ.50వేలు వసూలు చేస్తున్నట్లు తెలిసింది. ఇటీవల సూర్యాపేట జిల్లా మోతె మండలం రాఘవాపురానికి చెందిన గర్భిణి అనూష మృతితో ఈ ఆర్ఎంపీ బాగోతం బట్టబయలైంది. బయ్య నగేశ్-అనూష దంపతులకు ఇద్దరు ఆడపిల్లలు. అనూష మరోసారి గర్భం దాల్చడంతో పుట్టబోయేది ఆడ బిడ్డో, మగ బిడ్డో తెలుసుకునేందుకు సూర్యాపేట మండలం టేకుమట్లకు చెందిన ఓ ఆర్ఎంపీని సంప్రదించారు. ఆయన నకిరేకల్ పట్టణంలోని సదరు ఆర్ఎంపీ దగ్గరికి తీసుకొచ్చి స్కానింగ్ చేయించాడు. కడుపులో ఉన్నది ఆడ బిడ్డ అని అతడు చెప్పడంతో అనూషకు అబార్షన్ చేయించాలని ఆమె బంధువులు సదరు నకిరేకల్ ఆర్ఎంపీకి చెప్పారు. దాంతో సూర్యాపేటలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి ఆమెను తరలించారు. అక్కడ అనూషకు అబార్షన్ చేసే ప్రయత్నంలో వైద్యం వికటించింది. దాంతో అనూషను హుటాహుటిన ఖమ్మం దవాఖానకు తీసుకువెళారు. అక్కడ చికిత్స పొందుతూ ఈ నెల 18న అనూష మృతి చెందింది. ఆమె మృతితో నకిరేకల్ ఆర్ఎంపీ పరారయ్యాడు. సూర్యాపేటలో కేసు నమోదు కాగా, నకిరేకల్ పోలీసులు కూడా సదరు ఆర్ఎంపీ కోసం గాలిస్తున్నట్లు తెలిసింది.



భాగ్యారెడ్డివర్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ హనుమంతరావు

## భాగ్యారెడ్డివర్మకు నివాళి

భువనగిరికలెక్టరేట్, మే 22 : దళిత వైతాళికుడు భాగ్యారెడ్డివర్మ జయంతిని కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. కలెక్టర్ హనుమంతరావు.. అదనపు కలెక్టర్ వీరారెడ్డితో కలిసి భాగ్యారెడ్డివర్మ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భాగ్యారెడ్డివర్మ గొప్ప సంఘ సంస్కర్త, ఆది ఆంధ్ర సభ స్థాపకుడని గుర్తుచేశారు. 1906-1933 మధ్య హైదరాబాద్ సంస్థానంలో 26 దళిత బాలికల పాఠశాలలను స్థాపించి వారి అభ్యున్నతికి పునాది వేశారని కొనియాడారు. జగన్ మిత్ర మండలి, మన్య సంఘం, సంఘ సంస్కార నాటకమండలి, అహింసా సమాజాన్ని స్థాపించి హైదరాబాద్‌లో సంఘ సంస్కరణకు ఎంతో కృషి చేవారన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ కృష్ణారెడ్డి, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ జిల్లా అధికారి వసంతకుమారి, జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

### నేడు డయల్ యువర్ డీఎం

సూర్యాపేట అర్బన్, మే 22 : సూర్యాపేట డిపో పరిధిలోని సమస్యలు, సలహాలను తెలియజేసేందుకు శుక్రవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ లక్ష్మీనారాయణ తెలిపారు. ఉదయం 11గంటల నుంచి 12 గంటల వరకు ప్రయాణికులు 99592 26306 నంబర్‌కు ఫోన్ చేయొచ్చని గురువారం ఒక ప్రకటనలో సూచించారు.

### ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం

సూర్యాపేట అర్బన్, మే 22 : సూర్యాపేట జిల్లావ్యాప్తంగా ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. మొదటి రోజు ఉదయం జరిగిన ఫస్టియర్ జనరల్ విభాగంలో మొత్తం 1,954 మంది విద్యార్థులకు గానూ 149 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విభాగంలో 358 మందికిగాను 49 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన సెకండియర్ పరీక్షల్లో జనరల్‌లో 680 మంది విద్యార్థులకు గానూ 631 మంది, ఒకేషనల్‌లో 85 మందికి 74 మంది హాజరయ్యారు. జిల్లా కేంద్రంలోని పలు పరీక్షా కేంద్రాలను ఇంటర్మీడియట్ జిల్లా అధికారి భానూనాయక్ సందర్శించారు.

## నల్లగొండ ఏఎస్పీగా రమేశ్



జి.రమేశ్

నీలగిరి, మే 22 : నల్లగొండ అదనపు ఎస్పీగా జి.రమేశ్‌ను నియమిస్తూ గురువారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నల్లగొండ ఏఎస్పీగా పని చేస్తున్న బి.రాములునాయక్‌ను రెండు నెలల క్రితం డీజీపీ కార్యాలయానికి అటాచ్ చేసి, డీసీఆర్‌బీ డీఎస్పీగా ఉన్న రమేశ్‌కు అదనపు బాధ్యతలు అప్పగించింది. ఇన్‌చార్జి ఏఎస్పీగా పనిచేస్తున్న రమేశ్‌కు పదోన్నతి కల్పించి నల్లగొండ ఏఎస్పీగా నియమించింది.

### సూర్యాపేటకు రవీందర్‌రెడ్డి

సూర్యాపేట టౌన్ : సాధారణ బదిలీల్లో భాగంగా సూర్యాపేట ఏఎస్పీ నాగేశ్వర్‌రావు హైదరాబాద్ డీజీపీ కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో హైదరాబాద్ అడిషనల్ డీసీపీగా పనిచేసిన యు.రవీందర్ రెడ్డి బదిలీపై ఇక్కడికి వచ్చారు.

## మున్సిపల్ కార్మికుల బకాయి వేతనాలు చెల్లించాలి

- సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా



కలెక్టర్ హనుమంతరావుకు వినతి పత్రం ఇస్తున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పాండు, నాయకులు, కార్మికులు

భువనగిరి కలెక్టరేట్, మే 22 : మున్సిపల్ కార్మికుల పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దాసరి పాండు డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికులతో కలిసి గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. అనంతరం కలెక్టర్ హనుమంతరావుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పాండు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల బకాయి వేతనాలు చెల్లించాలని, ట్రెజరీ ద్వారా కాకుండా నేరుగా జనరల్ ఫండ్ నుంచి అందించాలని కోరారు. కార్మికులెవరైనా మరణిస్తే ఆ కుటుంబానికి రూ.30లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మికుల సంఘం అధ్యక్షుడు మాయ కృష్ణ, యూనియన్ నాయకులు ఊదరి రామచందర్, ఆడెపు వెంకటేశ్, సల్ల రాజయ్య, స్వామి, శ్రీకాంత్, శర్మ, కొండమడుగు యాదమ్మ, శాంతమ్మ, లక్ష్మి, కిష్టమ్మ, శ్యామల, సునీత పాల్గొన్నారు.

## మూసీలో యువకుడి మృతి

కేతేపల్లి, మే 22 : మూసీ నదిలో స్నానం చేసేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు అందులో మునిగి యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని ఉప్పలపహాడ్ గ్రామ శివారులో గురువారం చోటు చేసుకుంది. ఏఎస్ఐ ఎన్.శ్రీనివాసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లోని ఎన్‌టీఆర్ జిల్లా జీ.కొండూరు మండలం కౌలూరు గ్రామానికి చెందిన గాలంకి నీరజ్(21) సోదరుడి వరుసైన వెంకట రవీందర్‌రావుతో కలిసి నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం ఆకారం గ్రామంలోని బంధువుల ఇంటికి గురువారం బైక్‌పై బయల్దేరాడు. మార్గ మధ్యంలో ఉప్పలపహాడ్ గ్రామ శివారులో మూసీ నదిపై గల పాత వంతెన వద్ద బైక్ నిలిపి, స్నానం చేసేందుకు ఇద్దరు యువకులు నదిలోకి వెళ్లారు. ఈ క్రమంలో నీరజ్ నీటిలో మునిగిపోయాడు. పక్కనే ఉన్న రవీందర్‌రావు అతడిని కాపాడే ప్రయత్నం చేసినా ఫలితం లేకుండా పోయింది. నీరజ్ నీటిలో మునిగి పోయాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసులు మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం నకిరేకల్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మృతుడి తల్లి రజనీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

# కొనుగోళ్లలో కోత

## ప్రతి సీజన్‌లోనూ తగ్గుతున్న ధాన్యం కొనుగోళ్లు

- రైతుల విషయంలో చేతులెత్తేస్తున్న ప్రభుత్వం
- బీఆర్‌ఎస్ హయాంలో యాసంగిలో 3.61లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్లు
- ఈ సీజన్‌లో ఇప్పటివరకు సేకరించింది 2.84లక్షల మెట్రిక్ టన్నులే
- ఇంకో 20వేల మెట్రిక్ టన్నులు తీసుకునే చాన్స్ ఉందంటున్న అధికారులు
- గత యాసంగిలో 2.40లక్షల మెట్రిక్ టన్నులే..
- ఇదీ సూర్యాపేట జిల్లాలో ధాన్యం కొనుగోళ్ల తీరు



తుంగతుర్తి మండలం అన్నారం ఐకేపీ కేంద్రంలో ధాన్యం కాంటా వేయాలని పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నం చేస్తున్న రైతు ఉప్పల వెంకన్న (ఫైల్)

సూర్యాపేట, మే 22 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ పాలనలో రైతులకు అవస్థలు తప్పడం లేదు. పండించిన పంటలను అమ్ముకుందామన్నా వారాల తరబడి కొనే దిక్కు లేకపోవడంతో ప్రైవేటులో తక్కువ ధరకు అప్పజెప్తున్న దుస్థితి నెలకొంది. గత బీఆర్‌ఎస్ హయాంలో రైతులు పండించిన పంటను వందకు వంద శాతం కొనుగోలు చేసి రోజల వ్యవధిలోనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేసేవారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి కొనుగోళ్లకు ఇబ్బందులు తప్పడం లేదు. సూర్యాపేట జిల్లాలో ఒక్క యాసంగి సీజన్‌ను పరిశీలిస్తే చాలు ఈ విషయం తేటతెల్లం అవుతుంది. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న చివరి యాసంగి అయిన 2022-23లో జిల్లా వ్యాప్తంగా 3,61,445 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. తదనంతరం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండు యాసంగిల్లో మొదటి సీజన్‌లో 1.20 లక్షల మెట్రిక్ టన్నులు తక్కువ కొనుగోలు చేయగా, ఈ సీజన్‌లో 60వేల మెట్రిక్ టన్నులు తక్కువ సేకరించే పరిస్థితులు కనిపిస్తున్నాయి. కేవలం ప్రభుత్వానికి రైతులంటే ప్రాధాన్యం లేకపోవడం వల్లే ధాన్యం కొనుగోళ్లు నత్తనడకన కొనసాగుతున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రైతులకు వరుస ఇబ్బందులు తప్పడం లేదు. ఉమ్మడి రాష్ట్రంలో సూర్యాపేట జిల్లా రైతాంగం పరిస్థితి దయనీయంగా ఉండగా, గత కేసీఆర్ సర్కారు సాగు నీరు, నిరంతర ఉచిత విద్యుత్, రైతు బంధు, చివరి గింజ వరకూ ధాన్యం కొనుగోళ్లతో సాగును సస్యశ్యామలం చేశారు. దాంతో అన్నదాతలు ఆర్థికంగా కొంత నిలదొక్కుకున్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ఏడాదిన్నర పాలనలో మళ్లీ ఉమ్మడి రాష్ట్రంలోని పరిస్థితులు కనిపిస్తున్నాయి. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం పంట చేతికి వచ్చే సమయానికే ఊరూరా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులు పండించిన చివరి గింజ వరకూ కొనుగోలు చేసేది. కానీ, ప్రస్తుతం రైతులు అష్టకష్టాలు పడి పండించిన పంటను అమ్ముకునేందుకు దిక్కూ దిశ లేకుండా పోతున్నది. ఈ యాసంగిలో దాదాపు 70 శాతం వరి కోతలు పూర్తయిన తరువాత కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారు. లారీల కొరత, ఐకేపీ కేంద్రాల నుంచి వెళ్లిన ధాన్యం దిగమతికి కొర్రీలతో చాలాచోట్ల ఐకేపీ కేంద్రాలకు వచ్చిన ధాన్యం నెలకు పైగా కాంటాలకు నోచక అలాగే ఉండిపోయింది. ఎండ, వానకు రైతుల నిరీక్షణ తప్పలేదు.

### దాదాపు 60వేల మెట్రిక్ టన్నులు తక్కువ

సర్కారు నిర్లక్ష్యమో, శాఖల మధ్య సమన్వయ లోపమో గానీ జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు తగ్గుతూ వస్తున్నది. బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్న 2022-23 యాసంగిలో అప్పటి కేసీఆర్ ప్రభుత్వం సూర్యాపేట జిల్లాలో 3,61,445 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసింది. తదనంతరం కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తొలి యాసంగి 2023-24లో 2,40,578 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే కొనుగోలు చేశారు. అంటే 1,20,867 లక్షల మెట్రిక్ టన్నులు తక్కువ. ప్రస్తుత యాసంగిలో ఇప్పటి వరకు 2,84,356 లక్షల మెట్రిక్ టన్నులు సేకరించారు. మరో 20వేల మెట్రిక్ టన్నుల వరకు కొనుగోలు చేయనున్నట్లు అధికారులు చెప్తున్నారు. ఈ లెక్కన 2023-24తో పోల్చితే 60వేల మెట్రిక్ టన్నులు తక్కువ కొనుగోలు చేసినట్లే. కొనుగోళ్లలో నిర్లక్ష్యం, జాప్యం కారణంగా విసుగెత్తుతున్న రైతులు నిత్యం ఏదోక చోట ఆందోళనకు దిగుతున్నారు. విధిలేని పరిస్థితుల్లో ప్రైవేట్‌లో తక్కువ ధరలకు దళారులు, వ్యాపారులకు తెగనమ్ముకుంటూ ఆర్థికంగా నష్టపోతున్నారు. తుంగతుర్తి మండలంలోని అన్నారం గ్రామంలోని ఐకేపీ కేంద్రంలో ధాన్యం పోసి నెల రోజులు అవుతున్నా కాంటా వేయకపోవడంతో విసుగెత్తిన రైతు ఉప్పల వెంకన్న బుధవారం కొనుగోలు కేంద్రంలోనే ఆత్మహత్యాయత్నం చేశారు. పక్కనున్న రైతులు గమనించి పెట్రోల్ బాటిల్ లాక్కోవడంతో ప్రమాదం తప్పింది.